మొగల్తూరులో వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారులపైనే నిలిచిపోయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

'పిజిఆర్ఎస్' ఫిర్యాదులపై.. చర్యలేవీ..!

నిడమర్రు మండలంలోని తిమ్మారావుగూడెం భూముల్లో ప్రభుత్వ భూమిని కలిపేసుకుని చేపల చెరువు తవ్వకాలు సాగించారని, దానిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు బాధితుడు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. చేపల చెరువుల రైతులకు చెరువు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చామని, రైతులు రాతపూర్వక వాంగ్మూలం ఇచ్చారని, ఆర్ఐ, విఆర్ఒ ఇచ్చిన నివేదికల ఆధారంగా ఇది జరిగిందంటూ పిజిఆర్ఎస్ ఫిర్యాదు మూసివేస్తున్నట్లు తెలిపారు. సదరు నివేదికలు, రైతుల వాంగ్మూలాల ప్రతులు ఇవ్వాలంటూ తహశీల్దార్ కార్యాలయానికి సమాచార హక్కుచట్టం దరఖాస్తు చేయగా సమాధానం లేకుండాపోయింది. దీంతో ఆర్‌డిఒ కార్యాయానికి అప్పీల్ చేయడంతో వారం రోజుల్లో సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. వాస్తవానికి తప్పుడు ఎండార్స్‌మెంట్ ఇస్తూ ఫిర్యాదును మూసివేసినట్లు తెలుస్తోంది.'

'చేపల చెరువుకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ దుర్వినియోగమవుతుందని నిడమర్రు మండలంలోని విద్యుత్ శాఖ అధికారులకు పిజిఆర్ఎస్‌లో ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. తహశీల్దార్, ఎఫ్‌డిఒ, సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేసినట్లు తెలుపుతూ, ఆ కాపీలను అప్‌లోడ్ చేసి మండలాధికారులు ఫిర్యాదు మూసివేశారు. ఉంగుటూరులో ఉన్న విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఇఇ) అధికారికి ఫిర్యాదు రీఓపెన్ చేశారు. ఆయన సమస్యను పూర్తిగా పరిష్కరించకుండా మళ్లీ మండలాధికారులు ఇచ్చిన నివేదికలనే ఇచ్చి పిజిఆర్ఎస్ ఫిర్యాదును మూసివేశారు.

తప్పుడు ఎండార్స్‌మెంట్లతో ఫిర్యాదుల మూసివేత

సమాచార హక్కు చట్టంలో అడిగినా సమాధానం ఇవ్వని దుస్థితి

ఫిర్యాదుపై సంతృప్తి చెందక రీఓపెన్ చేస్తే కింది అధికారుల నివేదికలతో డివిజన్ అధికారి మళ్లీ మూత

విసిగిపోతున్న జనం.. నెలలు, సంవత్సరాలపాటు తిరగాల్సిన పరిస్థితి

డివిజన్, మండల కేంద్రాల్లో నామకహగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఫిర్యాదులే కాదు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం అత్యధికంగా ఇదేవిధంగా సాగుతోంది. పిజిఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) ఫిర్యాదులను అధికారులు తూతూమంత్రంగా మార్చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం జనం ఇస్తున్న ఫిర్యాదులను మండల, డివిజన్ అధికారులు సరిగ్గా పట్టించుకోని పరిస్థితి ఉంది. గడువు చివరిరోజు వరకూ వేచిచూసి సమస్యను పరిష్కరించకుండానే ఏదోక కారణం చూపి మూసివేస్తున్నారు. మండలాధికారుల వద్ద సమస్య పరిష్కారం కాలేదని, డివిజన్‌స్థాయి అధికారులకు రీఓపెన్ చేస్తే మండలాధికారుల ఇచ్చిన నివేదికలనే మళ్లీ జతచేసి మూసివేస్తున్నారు. ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పిజిఆర్ఎస్‌ను నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా అధికారులు, ప్రభుత్వం సైతం చెబుతోంది. జిల్లాలో ప్రతి సోమవారం దాదాపు 200 వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుంటాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ముందుగా సంబంధిత శాఖ మండలాధికారులకు ఇస్తున్నారు. మండలాధికారుల చుట్టూ తిరిగితిరిగి జిల్లా కేంద్రానికి వస్తే మళ్లీ తిరిగి అక్కడికే తమ ఫిర్యాదును పంపుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఫిర్యాదును బట్టి నెల రోజుల నుంచి వంద రోజుల వరకూ గడువు విధిస్తున్నారు. రోజులన్నీ గడిచిన తర్వాత చివరిరోజు ఏదోకటి రాసేసి మండలాధికారులు ఫిర్యాదులు మూసివేస్తున్నారు. తర్వాత మళ్లీ ఫిర్యాదు చేసుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. కొంతమంది అధికారులు తప్పుడు ఎండార్స్‌మెంటులు (సమాధానాలు) సైతం పేర్కొంటూ ఫిర్యాదులను మూసివేస్తున్న పరిస్థితి ఉంది. ఫిర్యాదుదారులకు అనుమానం వచ్చి ఫిర్యాదు మూసివేసిన నివేదికలను సమాచార హక్కుచట్టంలో అడిగితే ఇవ్వడం లేదు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఒకటి, రెండుసార్లు తిరిగి అలసిపోయి చాలామంది పిజిఆర్ఎస్‌కు రావడానికి సైతం ఇష్టపడటం లేదు. జిల్లా ఉన్నతాధికారులు పిజిఆర్ఎస్ ఫిర్యాదుల మూసివేతల్లో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటేనే ప్రజలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

నామకహగా మండల, డివిజన్లలో పిజిఆర్ఎస్‌లు

ప్రతి సోమవారం మండల, డివిజన్ కేంద్రాల్లో పిజిఆర్ఎస్ ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని జిల్లా అధికారులు పత్రికా ప్రకటనలు ఇస్తూనే ఉంటారు. వాస్తవానికి మండల, డివిజన్ కేంద్రాల్లో సక్రమంగా పిజిఆర్ఎస్ ఫిర్యాదుల కార్యక్రమం జరగడం లేదు. కొన్ని డివిజన్ కేంద్రాల్లో జరిగిన ఆర్‌డిఒలు ఉండటం లేదు. ఎఒలు, కిందిస్థాయి అధికారులు ఫిర్యాదులు తీసుకుంటున్నారు. గట్టిగా పట్టుబడితే తప్ప ఆన్‌లైన్ కూడా చేయడం లేదు. ఫిర్యాదు ఇచ్చిన జిరాక్స్‌పై స్టాంప్ వేసి పంపిస్తున్నారు. జిల్లా కేంద్రం ఏలూరు డివిజన్‌లో సోమవారం సైతం ఫిర్యాదులు తీసుకోవడం లేదు. జిల్లాస్థాయిలో పిజిఆర్ఎస్ జరుగుతుంది కదా అని చెబుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే ఆన్‌లైన్ చేయకుండా తీసుకుంటున్నారు. మండలస్థాయిలో పరిస్థితులు మరింత ఘోరంగా ఉన్నాయి. పిజిఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేవిధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఎన్‌టిఆర్ వైద్య సేవలందిస్తున్న.. 17 ఆసుపత్రులపై ఫిర్యాదు

వైద్య సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నట్టు నిర్ధారణ

వసూలు చేసిన మొత్తానికి రెట్టింపు అపరాధ రుసుం వసూలుకు ఆదేశాలు

ఎన్‌టిఆర్ వైద్య సేవలకు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

మూడో హెచ్చరికతో ఎన్‌టిఆర్ వైద్య సేవ గుర్తింపు రద్దుకు సిఫార్సు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవల్లో భాగంగా ఉచిత చికిత్సలకు ఏ హాస్పిటల్ అయినా డబ్బులు వసూలు చేస్తే పెద్ద మొత్తంలో అపరాధ రుసుంతో పాటు, కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై 17 ఆసుపత్రులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను విచారించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల కోసం చేస్తున్న వైద్య సహాయానికి తూట్లు పొడిచే విధంగా కొన్ని ఆసుపత్రులు డబ్బులు వసూలు చేయడంపై సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతారా అని ప్రశ్నించారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఎంతటి హాస్పటల్ నైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పుట్టిన పిల్లలకు కామెర్లు లేకుండానే, కామెర్ల పేరిట ఫొటో థెరపీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, ప్రయివేటు ఆసుపత్రుల్లో పుట్టిన ప్రతిబిడ్డ రక్త నమూనాలూ సేకరించి పరీక్షించడం జరుగుతుందని, ఫొటో థెరపీ అవసరం లేకుండానే చికిత్స చేసినట్లు తెలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులతో కూడిన ప్రసూతి సేవలు ఉచితంగా అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ఆసుపత్రి డెంగీ లేకుండానే డెంగీ పేరిట వైద్యం చేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు సంబంధిత రోగుల నుండి శాంపిల్స్ తీసుకోవడం, డెంగీ వాస్తవం కాదని స్పష్టం కావడంతో ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందని సంబంధిత ఆసుపత్రి డాక్టర్‌ను నిలదీశారు. ఒక వేళ డెంగీ పాజిటివ్ వస్తే మీరు ప్రభుత్వాసుపత్రికి తెలియజేయాలి కదా, ఇది ఎంత ప్రమాదకరమైన విషయమో మీకు డాక్టర్‌గా తెలియదా, తెలియజేయకపోవడంతోనే మీ ఉద్దేశం ఏంటో స్పష్టంగా అర్థమవుతుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డెంగీ పేరిట వసూలు చేసిన మొత్తానికి మూడు రెట్లు కలిపి అపరాధ రుసుంగా వసూలు చేయాలని ఆదేశించారు. అదే ఆసుపత్రి మరో కేసు కేసు విషయంలో రూ.80 వేలు వసూలు చేసినందుకు దానికి రెట్టింపు కలిపి అపరాధ రుసుంగా వసూలు చేయాలని ఆదేశించారు. స్మైల్ డెంటల్ హాస్పిటల్ అండ్ ఫేషియల్ సర్జరీ సెంటర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద చికిత్స చేయకుండానే చికిత్స చేసినట్లు బిల్లు క్లైమ్ చేశారనే అభియోగంలో వాస్తవం లేదని ధ్రువీకరించారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ జి.గీతా బాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కీర్తి శ్రవణ్, వర్మ హాస్పిటల్, తణుకు యాపిల్ హాస్పిటల్, రాజర్షి హాస్పిటల్, ఆర్యే గాయత్రి హాస్పిటల్, సూరి తేజ ఆర్థోపెడిక్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, యూనియన్ హాస్పిటల్స్ ఆఫ్ రామలక్ష్మి హెల్త్ కేర్ ప్రయివేటు లిమిటెడ్ తదితర ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'లో కోత సిగ్గుచేటు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుతం తల్లికి వందనంలో పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2 వేలు కోతపెట్టడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ విమర్శించారు. తల్లికి వందనం పథకంలో కోత విధించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బి.గణేష్ అధ్యక్షత వహించగా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేలు విద్యార్థుల విద్యకు ఉపయోగపడతాయని, ప్రయివేట్ విద్యా సంస్థల్లో ఫీజులు కట్టడానికి దోహదపడతాయని భావించారన్నారు. అయితే ప్రభుత్వం ప్రతి తల్లి అకౌంట్లో డబ్బులు పడతాయని చెప్పి ఆ సంతోషం అరక్షణం కూడా ఉండనివ్వకుండా చేసిందన్నారు. కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలలోపు ఉండాలని, రేషన్‌కార్డు ఉండాలని, కరెంట్ బిల్ నెలకు 300 యూనిట్లు దాటకూడదంటూ విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం హాజరు ఉండాలంటూ షరతులు పెడుతూ పాఠశాల అభివృద్ధికి 2 వేల రూపాయలు కోత విధించటం చిగ్గుచేటు అన్నారు. ప్రతి విద్యార్థికీ ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం వర్తింపజేసి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని నిరసనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గోవింద్, లక్ష్మణ్, సింధు, జ్యోతి, రోహిత్, సాయి ఫణికుమార్, పట్టణ కమిటీ సభ్యులు సాయికృష్ణ, కొండయ్య, రమాదేవి, ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరంలో నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

జెడ్‌పి సిఇఒగా శ్రీహరి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చి మగోదావరి జిల్లా పరిషత్ సిఇఒగా ఎం.శ్రీహరి నియమితులయ్యారు. నెల్లూరు జిల్లాలో ఎంపిడిఒగా పని చేస్తూ డిఎల్‌డిఒగా ఉద్యోగోన్నతి పొంది జిల్లాకు సిఇఒగా నియమితుల య్యారు. కొంతకాలంగా జెడ్‌పికి రెగ్యులర్ సిఇఒ లేరు. డిప్యూటీ సిఇఒ కె.భీమేశ్వరరావు ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నారు. బదిలీల్లో భాగంగా ఇప్పుడు పూర్తిస్థాయి సిఇఒ నియమితులయ్యారు. సిఇఒగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెట్రిసెల్విని కలిశారు. బాధ్యతలు స్వీకరించిన జెడ్‌పి సిఇఒకు కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఇఒ శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు ప్రణాళిక సిద్ధం చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని కాలువలు, చెరువు గట్ల ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వాచ్ డాగ్ కమిటీ సభ్యులు, రెవెన్యూ డివిజన్ అధికారులతో ఆక్రమణదారుల నుంచి కాలువలు, చెరువులు ట్యాంక్ గట్ల రక్షణ కోసం జిల్లాస్థాయి వాచ్ డాగ్ కమిటీతో సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో ఫ్యాక్టరీలు, చిన్న తరహా పరిశ్రమలు, వాణిజ్య వ్యాపారాలు, సెప్టిక్ ట్యాంకుల వల్ల తాగునీటి కాలువలు, చెరువులు కలుషితమయ్యే ప్రదేశాలను గుర్తించి తొలగించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకూ జిల్లాలో 350.38 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు ఆక్రమణలను పూర్తిస్థాయిలో గుర్తించాలన్నారు. జులై నుండి మూడు నెలల్లో ఆక్రమణలన్నీ తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, ఎసిబి శ్రీలక్ష్మి, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్ రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చుని మున్సిపల్ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించలని, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవి.కృష్ణ, రత్నం, సత్యనారాయణ. ఫణి, ఎం.సత్యనారాయణ, కె.శ్రీను, సుజాత పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఉపాధి హామీ జోలికొస్తే ఊరుకోం : వ్యకాస

ప్రజాశక్తి - తణుకు

కూలీలకు సంజీవని వంటి ఉపాధి హామీ జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ మండుటెండలో కష్టపడి పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మూడు నెలల వేతనాలు చెల్లించకపోవడంతో కూలీల ఆర్థిక పరిస్థితి మరింత దుర్భరంగా మారిందన్నారు. కూలీలకు చెల్లించాల్సిన బకాయిలపై దృష్టి పెట్టకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోడీ భజన చేస్తోందని విమర్శించారు. ఇలా అయితే భవిష్యత్తులో ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూలీలకు ఇబ్బందిగా ఉన్న రెండు ఫొటోల విధానం రద్దుచేసి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.వెంకటలక్ష్మి, విప్పర్తి ప్రసన్న, దేవర దుర్గాప్రసాద్, మేడ ముత్యాలు, దాసరి వెంకటలక్ష్మి, బర్రె మార్తమ్మ పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించండి

తహశీల్దార్‌కు ఆయకట్టు రైతుల వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

తోలేరు శివారు పడమటిపాలెం, వెంకటాపురం, కొండేపూడి, వేంద్ర ఆయకట్టు రైతులు డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్ ఎంవి.రామాంజనేయులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. తమ వ్యవసాయ భూములకు సంబంధించిన డ్రెయిన్ ఆక్రమణలకు గురవ్వడంతో ఏటా తమ పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ సమస్యపై అనేక దఫాలుగా ఆందోళనలు చేశామని తెలిపారు. అప్పటి నరసాపురం ఆర్‌డిఒ క్షేత్రస్థాయిలో పరిశీలించి డ్రెయిన్ ఆక్రమణలు తొలగించి వెంటనే పూడిక పనులు చేపట్టాలంటూ ఆదేశాలిచ్చారని తెలిపారు. అయినప్పటికీ మూడు సంవత్సరాలుగా డ్రెయినేజీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అయితే ప్రస్తుతం స్వచ్ఛందంగా కొంత సొమ్ము సమకూర్చుకున్నామని, ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటే డ్రెయినేజీ తవ్వుకుంటామంటూ రైతులు తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వీరవల్లి చంద్రశేఖర్, సర్పంచి వేంద్ర వెంకట లీలాకృష్ణ, రైతులు వేంద్ర సూరిబాబు, శీలం విజయకుమార్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెళ్లికి వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్య పరిస్థితి విషమం, పిల్లలకు గాయాలు

పాలకొల్లు :సొంత బావమరిది పెళ్లి కోసం ఆ కుటుంబం పాలకొల్లు నుంచి హైదరాబాద్ వెళ్లింది. వివాహ వేడుకలో ఎంతో ఆనందంగా గడిపారు.. ఆ ఆనంద క్షణాలు ఎంతో సేపు మిగలేదు.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటనలో భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. ఈ ఘటన కృష్ణ జిల్లా కృత్తివెన్ను మండలం సంగమూడి వద్ద చోటు చేసుకుంది.

వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొల్లుకు చెందిన కుంపట్ల రాంగోపాల్ (41) భార్య రీతు, కుమార్తె ప్రణవి, కుమారుడు రామాంజనేయులతో కలిసి తన సొంత బావమరిది వివాహం నిమిత్తం కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. వివాహం అనంతరం తిరిగి గురువారం ఉదయం హైదరాబాద్ నుండి కారులో బయలుదేరారు. అయితే మధ్యాహ్నం కృష్ణ జిల్లా కృత్తి వెన్ను మండలం సంగమూడి జెడ్‌పి హైస్కూల్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును లారీని ఢీకొంది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న రాంగోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న కుమార్తె ప్రణవికి, వెనుక ఉన్న కుమారుడు రామాంజనేయులు స్వల్పగాయాలయ్యాయి. అయితే రాంగోపాల్ భార్య రీతు ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. దీంతో రాంగోపాల్ ఇంటి దగ్గర బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

పంట కాలువలోకి స్కూల్ బస్సు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాలలు తెరిచిన రెండో రోజే స్కూల్ బస్సు ప్రమాదానికి గురవ్వడంపై తల్లిదండ్రులు భయపడుతున్నారు. కోమటిగుంట గ్రామంలో భీమవరంలోని ఓ ప్రయివేటు విద్యాసంస్థకు చెందిన బస్సు శుక్రవారం ప్రమాదానికి గురైంది. కోమటిగుంట గ్రామంలో విద్యార్థులను తీసుకెళ్లడానికి వచ్చిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో అదుపుతప్పి పంటకాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కోమటిగుంటలో పంటకాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

నియోజవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం పెదఅమిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటన మనసు కలిచి వేసిందని, ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వం నిధులు రాకపోయినా ప్రజల సహకారంతో ఇన్ఫ్రాస్ట్రక్చర్ అకౌంట్ మొదలుపెట్టి కాలువ ప్రక్షాళన పనులు చేయడం జరిగిందన్నారు. దాతల సహకారంతో నియోజకవర్గంలోని ఉండి హైస్కూల్‌ను రూ.65 లక్షలతో, పాలకోడేరు హైస్కూల్ రూ.50 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గంలో నాలుగు హాస్టళ్లలో విద్యార్థులకు 250 మంచాలు, దుప్పట్లు, పరుపులు దాతల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులతో 18 మైక్రో ఫిల్టర్ బెడ్‌లు, కెనరా బ్యాంక్ ఆర్థిక సహకారంతో 25 మైక్రో ఫిల్టర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామ గ్రామాన స్వచ్ఛమైన తాగునీటి కోసం మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేస్తానన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాల్లో పార్కులను నిర్మిస్తామన్నారు. మన పరిసరాలను మనం బాగు చేసుకోవాలంటే ప్రభుత్వంపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గంలో క్రైమ్ అదుపు చేయడం కోసం స్కూల్, కాలేజీలు, ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశానన్నారు. నిబంధనలు పాటించకుండా చెరువులు తవ్వడం వల్ల ఆక్వా వ్యర్థ జలాలు పంట కాలువలో కలిసి నీరు కలుషితమవుతోందన్నారు. ఆ నీరు తాగడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు.

ధన్యజీవి కరుటూరి రాధ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - ఆచంట

ఐద్వా సీనియర్ నేత కరుటూరి రాధ ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. ఆచంట వేమవరం గ్రామానికి చెందిన కరుటూరి రాధ (85) ఇటీవల అకాల మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేత మంతెన సీతారాం, రాధ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరుటూరి రాధ అకాల మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సిపిఎం పట్ల, ఐద్వా మహిళా నాయకురాలుగా అంకితభావంతో ఆమె భర్త కరుటూరి సత్యనారాయణతో పాటు నేను సైతం అంటూ ఎర్రజెండా పట్టుకుని తమ జీవిత చరమాంకం వరకూ అనేక పోరాటాల్లో పాల్గొన్న కుటుంబాలు అరుదుగా ఉంటాయన్నారు. రాధ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఎఒఐ రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం నాయకులు బండి రంగారావు, చదలవాడ చంటిబాబు పాల్గొన్నారు.



రాధ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

పాఠశాలకు గ్యాస్ స్టౌ అందజేత



గ్యాస్ స్టౌ అందిస్తున్న గాదె సుబ్బారావు

పాలకొల్లు : కూటమి ప్రభుత్వం ఆరోగ్య మెరుగుదలకు సన్న బియ్యం అందజేస్తున్నారని, విద్యార్థులకు కావలసిన సౌకర్యాల మెరుగుదలకు తాను అండగా ఉంటానని పాలకొల్లుకు చెందిన దాత గాదె సుబ్బారావు చెప్పారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్-2 కాపవరంకు పాలకొల్లుకు చెందిన రాయపాటి భవానీప్రసాద్ సహకారంతో దాత గాదె సుబ్బారావు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంట నిమిత్తం గ్యాస్ పొయ్యి అందజేశారు. దాత గాదె సుబ్బారావుకి పాఠశాల ప్రధానోపాధ్యాయిని వెల్ల బేబీ సరోజ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కుక్క తోట కుమారి, శానిటేషన్ ఆయా ఎ.ధనలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

రేపు మార్టేరులో బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణంలో ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న బాస్కెట్ బాల్ క్రీడా కారుల ఎంపిక జరుగుతుందని ట్రస్ట్ ప్రతినిధి, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ ప్లేయర్ సత్తి సుబ్బన్న రెడ్డి శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ ఏడాది 8, 9, 10 తరగతులు చదువుతున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులు, ముఖ్యంగా 172 సెం. మీ ఎత్తు ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన ప్లేయర్లకు ట్రస్ట్ భవనంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందని, 7382804885 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు పొందాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతిభా విద్యార్థికి ఇంటర్‌లో ఉచిత సీటు

భీమవరం టౌన్ : కీర్తిశేషులు డాక్టర్ బీడీ సురేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభ కలిగిన విద్యార్థికి ఉచిత సీటు అందించే కార్యక్రమాన్ని సివిఎస్ జూనియర్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించడం అంటే బాధ్యత అని, మా సంస్థలో ప్రతి ఏడాది ప్రతిభ కలిగిన విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా ఉచిత సీటును అందిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విస్సాకోడేరు జిల్లాపరిషత్ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యాసాగర్‌కు బీడీ సురేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటర్‌లో ఉచిత సీటును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తోట సీతారామలక్ష్మి

భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, పరిష్కారం కానటువంటి సమస్యలను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, భీమవరం ఎంఎల్ఎ, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింప చేయించడానికి టిడిపి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకటరామయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్, కృష్ణబలిజ సాధికార కమిటీ సభ్యుడు గంట త్రిమూర్తులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అధోగతి

ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, బొలిశెట్టి

పెనుమంట్ర : గత వైసిపి హయాంలో అరాచకం, విధ్వంసాల పాలన సాగించడంతో ప్రజలు జగన్ రెడ్డిని ఇంటికి పంపించి ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని మాజీ మంత్రి, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని మార్టేరు గ్రామంలో పల్లె పల్లెకు మన పితాని సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీరు ఇచ్చిన అధికారానికి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లిరామి రెడ్డి, ఎంపిటిసి సభ్యులు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, కోశాల శ్రీనివాసరెడ్డి, మండల తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ ఎంఎస్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర సుభిక్ష పాలన పూర్తయిన సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు కొత్త సంవత్సరంలో గ్రామానికి, నియోజకవర్గానికి, రాష్ట్రానికి ఉండాలని ఆకాంక్షిస్తున్నానని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎతో పాటు బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఈతకోట తాతాజీ, ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి, కూటమి నాయకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

రాంబాబు కుటుంబానికి పరామర్శ

నరసాపురం : పొన్నపల్లికి చెందిన నాటిన రాంబాబు గోదావరిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందాడు. శుక్రవారం పొన్నపల్లిలో రాంబాబు కుటుంబ సభ్యులను మత్స్యకారులు, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఈ ఘటన చాలా దురదృష్టకరమని, ఈ వృత్తి చాలా ప్రమాదకరమైనదని తెలిసినా జీవనోపాధి కోసం ఈ వృత్తిని జీవనాధారంగా ఎంచుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ తరహా ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈయన చనిపోవడం ఆ కుటుంబానికి తీరని లోటని రామ్మోహన్ రావు అన్నారు. వేటకు వెళ్లి చనిపోయిన రాంబాబు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి పది లక్షల యాక్సిడెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబానికి రెండు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి, గృహాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. పరామర్శించిన వారిలో సిఐటియు నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు ఉన్నారు.

నేడు భారీ అన్న సమారాధన

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి భారీ అన్న సమారాధన చేయనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేయనున్న సమారాధనకు యాత్రికులు తరలిరావాలని కోరారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

తాడేపల్లిగూడెం : రాత్రివేళ ఇంటిముందు, గేటు లోపల పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ బి.ఆది ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ ఆదేశాల మేరకు పట్టణ సిఐ బోను ఆది ప్రసాద్, ఎస్ఐ పి.నాగరాజు, క్రైమ్ పార్టీ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసి సదరు దొంగతనాలకు పాల్పడుతున్న పెరుమెళ్ల దాలయ్య, ఎ.పూతి ప్రసాద్ అను వ్యక్తిని శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలో పట్టుకుని విచారణ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, తణుకు టౌన్ 1, రావులపాలెం 2, గుడివాడ టౌన్ 2 వాహనాలు కలిపి మొత్తంగా 4 పోలీస్ స్టేషన్ పరిధిలో 9 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వాటిని రికవరీ చేయడం జరిగిందని, రికవరీ అయిన వాహనాలు అన్నీ కూడా సుజుకి యాక్సెస్ 125 మోడల్ వాహనాలు అని గుర్తించారు. సదరు కేసులో దర్యాప్తు, రికవరీలో ప్రతిభ కనబరచిన అధికారులు, సిబ్బందిని ఎస్‌పి, డిఎస్‌పి అభినందించారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

కాళ్ల : మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం పెదఅమిరం గ్రామంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగార్జుల లక్ష్మీకాంత్(34) భీమవరం బాలాజీ మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. లక్ష్మీకాంత్‌కు ఇద్దరు ఆడ పిల్లలున్నారు. నాగార్జుల లక్ష్మీకాంత్ మద్యానికి బానిసై మారినందున తన భార్య తనని వదిలి ఐదేళ్ల క్రితం పిల్లల్ని తీసుకొని వెళ్లిపోయింది. లక్ష్మీకాంత్ మద్యం సేవించి తన తల్లిదండ్రులను కూడా ఇబ్బంది పెడుతున్నాడు. పెదఅమిరంలోని గురువారం మద్యం మత్తులో రోడ్డుపై వస్తూ లిబర్టీ ఫ్యాక్టరీ దగ్గరలో రోడ్డు పక్కన ఉన్న రాయిపై పడి పోయినట్లు, ఆ తర్వాత అతనికి కనుబొమ్మ దగ్గర గాయమై చనిపోయినట్లు మృతుడు తండ్రి నాగార్జున వీర రాఘవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి
ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

భీమవరం: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ప్రయివేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఆర్ కళాశాలలో అధిక ధరలకు విక్రయిస్తున్న పుస్తకాల వ్యాపారాన్ని ఎస్ఎఫ్ఐ నేతలు అడ్డుకున్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నాగేశ్వరరావు కళాశాలకు చేరుకుని మూడు పుస్తకాల గదులకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పట్టణంలో పలు కార్పొరేట్ కళాశాలల విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను విద్యాసామాగ్రి రూపంతో దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు, ఇతర సామాగ్రి పుస్తకాలను కొనాలని తల్లిదండ్రులకు ఒత్తిడి చేస్తూ, అసలు ధర కన్నా రెండు నుంచి మూడు రెట్లు అధికంగా అమ్ముతూ తల్లిదండ్రుల జేబులను గుల్ల చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ కళాశాలలో విస్తృత తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు లక్ష్మణ్, గోవింద్, జ్యోతి, సింధు, సాయి, సాయికృష్ణ, రోహిత్, సతీష్, హేమంత్ పాల్గొన్నారు.

పల్లెల్లో, పట్టణాల్లో దర్జీలకు ఎంతో ఆదరణ

భీమవరం టౌన్ : దర్జీ వృత్తి(టైలరింగ్) అంటే ఆనాటి రోజుల్లో ఒక వెలుగు వెలిగిందని, ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాల వ్యవస్థ రావడంతో దర్జీ వృత్తి క్రమేణా మసకబారుతూ వస్తోందని భీమవరం పట్టణ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రామకోటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ కుట్టు యంత్రం దినోత్సవాన్ని నిర్వహించి ఏడుగురు కుట్టుమిషన్ వృత్తిదారులను సత్కరించారు. రామకోటేశ్వరరావు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం శుభకార్యాలు, పండుగలు వస్తున్నాయంటే దర్జీలకు చేతినిండా పని ఉండేదని, పల్లెల్లో, పట్టణాల్లో దర్జీలను ఎంతో ఆదరించేవారన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు శివకవి సాంబమూర్తి, కార్యదర్శి కాపా త్రినాథ్, కోశాధికారి పి.కళ్యాణ్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం ఏడుగురు కుట్టుమిషన్ వృత్తిదారులను సత్కరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వి.సత్యనారాయణ, కారుమూరి బాలచంద్ర కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌ను కలిసిన కొల్లు పెద్దిరాజు

నరసాపురం : రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్‌ను శుక్రవారం అమరావతిలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమైక్య ఛైర్మన్ కొల్లు పెద్ది రాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మత్స్యకారులను ఆదుకోవాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా సహకరించి, మత్స్యకారుల జీవన శైలిని మెరుగుపరచాలని కోరారు. మత్స్యకారులకు సంబంధించిన పథకాలకు నిధులు విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు.

సుప్రీం తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు

వైసిపి నేత వైట్ల కిషోర్ కుమార్

ఆచంట : అధికారాన్ని అడ్డు పెట్టుకుని సంవత్సర కాలంగా ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని వైసిపి నాయకుడు వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆచంటలో విలేఖర్లతో మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ఇచ్చిన హామీలు మర్చిపోయి, పథకాల అమలు పక్కన పెట్టి వైసిపి నేతలే టార్గెట్‌గా అక్రమ కేసులతో అరాచకం సృష్టిస్తున్న కూటమి ప్రభుత్వ అరాచకానికి పరాకాష్టగా కొమ్మినేనిని అరెస్ట్ చేశారన్నారు. టివి డిబేట్‌లో ఒక జర్నలిస్ట్ మాట్లాడిన మాటలను సాక్షి సామాన్యానికి, జగన్మోహన్ రెడ్డికి, కొమ్మినేనికి అంటగడుతూ అక్రమ కేసులతో అరెస్ట్ చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. వ్యక్తుల వాక్ స్వాతంత్రాన్ని కూడా అణిచివేసే ఎమర్జెన్సీ నడుస్తుందని చెప్పింది. ఈ తీర్పుతోనైన ప్రభుత్వం కళ్లు తెరచి పరిపాలన వైపు దృష్టి సారించాలి, కక్షసాధింపులు మానుకోండి, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆకివీడు : సమాజంలో నలుగురికి ఉపయోగపడాలనేది తమ లక్ష్యమని ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు అన్నారు. 2024-25 కార్యవర్గానికి సంవత్సరకాలం పూర్తయినందున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 2025-26 సంవత్సరానికి గాను ఎన్నికైన నూతన కార్యవర్గం శుక్రవారం స్థానిక లయన్స్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నూతన సభ్యులు ఈనెల 15వ తేదీ ఆదివారం స్థానిక వి కన్వెన్షన్ హాల్లో పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారని క్లబ్ ప్రస్తుత కార్యదర్శి మోర జ్యోతి రెడ్డి తెలిపారు. నూతన అధ్యక్షులుగా కెవిఎన్.పూర్ణ చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎస్‌విజి.అనిల్ కుమార్, కోశాధికారిగా పి.వంశీకృష్ణలతోపాటు పదవీకాలం పూర్తయిన అధ్యక్షులు కె.రాజరాజేశ్వరి సమన్వయకర్తగాను వ్యవహరిస్తారన్నారు. వీరితోపాటు మరో 11 మందితో నూతన కార్యవర్గం ఏర్పడింది. కాగా నూతన రీజన్ ఛైర్‌పర్సన్‌గా గొంట్ల కృష్ణమూర్తి, వివి.కృష్ణంరాజులు ఎన్నిక కాగా జోన్ ఛైర్‌పర్సన్లుగా మోటుపల్లి శ్రీనివాసరావు, పేర్ని సుబ్రహ్మణ్యంలు ఎన్నికయ్యారు. ఆదర్శ లియో క్లబ్ నూతన అధ్యక్షులుగా సోమిశెట్టి హర్షవర్ధన్, కార్యదర్శిగా గుర్రంసాయి ప్రదీప్, గుర్రం హేమంతులు ఎంపికయ్యారని వారు తెలిపారు. నూతన కార్యవర్గం చేత డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు, డాక్టర్ ఆర్‌వి.సూర్యనారాయణ రాజు ప్రమాణ స్వీకారం చేయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు నేరెళ్ల చెంచయ్య, మన్నే సుబ్రమణ్యం, ఎండి అహ్మద్ పాల్గొని మాట్లాడారు.

సిఎం సహాయనిధి అందజేత

తణుకు : తణుకు పట్టణం 4వ వార్డుకి చెందిన జక్కంశెట్టి నాగమణి అనారోగ్య కారణంతో బాధపడుతుంటే రూ.10 లక్షల ఆర్థిక సాయం స్థానిక కూటమి కార్యాలయంలో తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కేన్సర్‌తో బాధపడుతున్న నాగమణికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10 లక్షల రియంబర్స్‌మెంట్ అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో మెరుగైన వైద్యం అందనుందని ఎంఎల్ఎ రాధాకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎంఎల్ఎ అరిమిల్లి రాధాకృష్ణ చేస్తున్న సేవల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం : ఎంఎల్ఎ

పెనుమంట్ర : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ మిత్ర విద్యా కిట్స్ అనే పథకాలను ప్రారంభించామని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం మార్టేరులోని బసంతీదేవి జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం రేషన్‌ను ఎండిఎంలకు పంపిణీ చేశారు. పిల్లలకు విద్యా కిట్స్ అందజేశారు. విద్యా దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.రవికుమార్, ఎండిఒ ఎంఎస్.ప్రభాకర రావు, హెచ్‌ఎం ఎల్.నగేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలపాడు రైల్వే గేటు మూసివేత

ఆకివీడు : జిల్లా నుంచి ఆకివీడు మీదుగా ఏలూరు వెళ్లేందుకు ఆకివీడు శివారులో ఉన్న ఆలపాడు రైల్వే ట్రాక్ ఉన్న గేటును ఐదు రోజులు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. జాతీయ రహదారిలో ఉన్న గేట్ నెంబర్ 93ను రైల్వే ట్రాక్ గేటు సాధారణ మరమ్మత్తులకు గాను ఈనెల 13 నుంచి 17 వరకు మూసివేస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణాలు సాగించాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్‌కు రెడ్‌క్రాస్ అవార్డ్

తాడేపల్లిగూడెం: రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 21న నిర్వహించిన బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో అత్యధికంగా బ్లడ్ డొనేట్ చేయించినందుకు శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఎక్కువ మందితో రక్తదానం చేసినందుకు భీమవరం కలెక్టర్ కార్యాలయంలో కమిషనర్‌ను సన్మానం చేసి అభినందించారు.

సంపతరావు కుటుంబానికి పరామర్శ

సంపతరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామ పోరాట యోధురాలు, మహిళా సంఘం నాయకురాలు తెన్నేటి లక్ష్మి ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో లక్ష్మి కుటుంబ సభ్యులను శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పరామర్శించారు. లక్ష్మి భర్త చించినాడ పోరాట యోధుడు తెన్నేటి సంపతరావు, కుమారులు, కుమార్తెలు శివాజీ, స్టాలిన్, సత్యవతి, జానకిలను ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి వెంట సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, తొట్టెంపూడి కోటేశ్వరరావు, ఊటాల చిట్టిబాబు, ముమ్మిడివరపు ఆంజనేయులు, ఆకుమర్తి ఏసురత్నం, పల్లేరు వెంకటస్వామి, ఎస్.నాగమణి, ముస్కూడి జయశ్రీ, ఎస్. అనసూయ, ఎస్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ జయప్రదం చేయండి

11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

సమావేశంలో పాల్గొన్న పోలీసులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చేనెల 5వ తేదీన శనివారం తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ షేక్ సికిందర్ భాషా శుక్రవారం జరిగిన పోలీస్ అధికారుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులకు కేసుల రాజీకి సంబంధించిన తగిన సలహాలు, సూచనలను తెలియజేస్తూ తగినన్ని ఎక్కువ కేసులు కక్షిదారుల మధ్య రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితకుమారి, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు : మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిషేధ చట్టం, 2013 ప్రకారం ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడిన ఎడల వారిపై పోక్సో యాక్ట్, 2013 ప్రకారం వేధింపులకు గురిచేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలుంటాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ తెలిపారు. శుక్రవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ వేధింపులను ఎదుర్కొన్న వారు భయపడకుండా పై అధికారులకు తెలియజేయాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో కోర్టు సిబ్బంది, మహిళా పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశానికి తరలిరండి

అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు

తణుకు : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 15వ తేదీ ఆదివారం తణుకులో జరుగనున్న అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సమావేశానికి కష్టమర్స్, ఏజెంట్‌లు అధికసంఖ్యలో తరలిరావాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు కోరారు. శుక్రవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసానికి గురై తీవ్రంగా నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ సహకారంతో గత 10 సంవత్సరాలుగా నిర్విరామంగా ఉద్యమిస్తున్నామన్నారు. ఉద్యమ ఫలితంగా రూ.10 వేలు, రూ.20 వేలు లోపు డిపాజిట్ల సొమ్ము పొందడం జరిగిందన్నారు. ఇంకా మిగిలిన బాధితులకు సుమారు రూ.3 వేల 400 కోట్లు చెల్లించవలసి ఉందన్నారు. బాధితులకు పూర్తి న్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో కమిటీల ఏర్పాటుకు, కేసుల సత్వర పరిష్కారానికి, ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు అంగీకరించిందన్నారు. ఇప్పటికే ఒత్తిడికి గురై ఆరువందల మంది చనిపోయారని, ఇంకా ఎవరు చనిపోకుండా త్వరితగతిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి, నూనె రామశ్రీను, జి.కొండయ్య, పి.శ్రీనువాసు, పి.పాల్ సింగ్, జె.వెంకటసత్యనారాయణ, నూనె రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదాతలు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలని, సకాలంలో రక్తం అందుబాటులో లేక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా యూనిట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్తదానం మహాదానమని, రక్తం దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో మరొకరికి ప్రాణం పోసినట్లేనని తద్వారా ఒక కుటుంబం ఆనందంగా జీవించగలుగుతారన్నారు. జిల్లాలో 19 వేల యూనిట్లు రక్తం అవసరం కాగా 15 వేల యూనిట్ల సేకరణ జరుగుతుందని, మిగిలిన 4 వేల యూనిట్ల సేకరణకు దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఎంఎస్‌వి.శివరామ భద్రరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, డిప్యూటీ డిఎంహెచ్ఒ బి.భాను నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డిఇఒ ఇ.నారాయణ, ఆర్‌డిఒ ఉమామహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: భారతీయ స్టేట్ బ్యాంక్ కేవలం వ్యాపారం కోసమే కాకుండా సమాజసేవలో కూడా పాల్గొంటుందని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దినోత్సవం సందర్భంగా దేశంలోని అన్ని ముఖ్యకేంద్రాల వద్ద రక్తదానశిబిరాలు ఏర్పాటుచేసినట్లు బ్యాంక్ రీజనల్ మేనేజర్ రమేష్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్ద రక్తదాన శిబిరాన్ని రమేష్ నాయుడు ప్రారంభించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎన్.ప్రకాష్ మాట్లాడుతూ బ్యాంక్ పురోభివృద్ధికి సహకరించినట్టే సమాజసేవలో కూడా సిబ్బంది సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్‌బిఐ అధికారుల సంఘ జోనల్ కార్యదర్శి జి.జవహర్ లాల్, ఎపిటిబిఇఎఫ్ కార్యదర్శి టివి.సూర్యనారాయణ, యుఎఫ్‌బియు కన్వీనర్ ఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. మొత్తం 32 మంది బ్లడ్ డొనేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ సిబ్బంది, సంఘ నాయకుల పవన్ కుమార్, కార్యదర్శి డేనియల్ కిరణ్, దసిక శ్రీనివాస్ కనకారావు, స్టాఫ్ పాల్గొన్నారు.

నరసాపురం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే ప్రాణం పోసినట్లు అవుతుందని 7 ఆంధ్రా నేవల్ ఎగ్జిక్యూటివ్ లెఫ్టినెంట్ కమాండర్ సంజిత్ రాత్రే అన్నారు. శుక్రవారం నరసాపురం 7 ఆంధ్రా ఎన్‌సిసి నేవల్ యూనిట్ ఏర్పాటు చేసిన రక్తదాని శిబిరాన్ని ఆయన గ్రూప్ కమాండర్ రోహిత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇరువురు రక్తదానం చేశారు. వీరితో పాటు మరో 30 మంది ఎన్‌సిసి నేవి క్యాడెట్లు రక్తందానం చేశారు. నరసాపురం రెడ్ క్రాస్ యూనిట్ వీరి రక్తాన్ని సేకరించింది. ఈ సందర్భంగా సంజిత్ రాత్రే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారైనా రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అధికారి రాము, మురళీకృష్ణ, ఎనుముల సతీష్, గోపిశెట్టి వెంకట మురళీ కృష్ణారావు పాల్గొన్నారు.

తణుకు : తణుకు ప్రభుత్వాసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. అత్యవసర రోగులకు రక్తం నిల్వలు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఏలూరులో ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు నిల్వ చేసేందుకు పంపుతున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులకు రక్తం అవసరమైన సమయాల్లో ఏలూరు నుంచి తీసుకురావాల్సి వస్తోందని ఈ పరిస్థితుల్లో ఒక్కోసారి ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఇబ్బందులను అధిగమించేందుకు తణుకులో ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతను అధిగమించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పోస్టుల భర్తీ కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. శిబిరంలో రక్తదానం చేసిన దాతలను ఎంఎల్ఎ రాధాకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, ఆర్‌ఎంఒ డాక్టర్ సాయి బాలాజీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌కు సత్కారం



ధ్యాన్‌చంద్‌ను సత్కరిస్తున్న పోలిశెట్టి

నరసాపురం : ఉత్తమ రైతు అవార్డు ద్వారా వ్యవసాయ రంగంలో రైతుల పాత్ర, వారి కృషి గురించి ప్రజలకు అవగాహన కలుగుతుందని జనసేన సీనియర్ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పర్రు గ్రామంలో పోలిశెట్టి శ్రీనివాస్ నివాసంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి డాక్టర్ ఎంవి.రెడ్డి ఉత్తమ రైతు అవార్డు అందుకున్న అయితం ధ్యాన్‌చంద్‌ను పోలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అయితం ధ్యాన్ చంద్‌కు పోలిశెట్టి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నలుగురుకు అవార్డులు రాగా అందులో నరసాపురం నియోజవర్గం రామన్న పాలెంకు చెందిన ధ్యాన్‌చంద్ ఉండడం మన నియోజకవర్గానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో పోలిశెట్టి వాసు, ఆకన నరేష్, అయితం గణేష్, లక్కు శేషు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కాళ్ల

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వీర్ల క్రాంతికుమార్ అన్నారు. పెదఅమిరం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో సీజనల్ వ్యాధుల గురించి గ్రామంలో ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎపిడెమియాలజిస్ట్ జి.గాతల సుభాష్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే, దాని ప్రాధాన్యం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి వనరుల గురించి వివరించారు. గ్రామంలోని గృహాలను సందర్శించి నీటి నిల్వలో దోమ లార్వ కోసం పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్, పిహెచ్‌ఎన్ చండిరాణి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కీటకజనిత ప్రదేశాలను నిలువరిద్దాం, సమిష్టి కృషితో దోమలవ్యాప్తిని అరికడదామని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. ఎన్‌టిఆర్ జంక్షన్, కథకట్ల, యాగర్లపల్లి ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 15, 16, 25, 33, 34, 35వ వార్డులలో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే, వెక్టర్ కంట్రోల్ హైజినే కార్యక్రమాలను శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసి ప్రస్తుతం జరుగుతున్న మలేరియా మాసోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, చిన్నప్ప, జ్యోతి, రాజేశ్వరి, అంబికా, చంద్ర అంగన్వాడీ కార్యకర్త స్వాతి, కనకదుర్గ భవాని పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **అశ్వారావుపేట బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపినస్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కంభంపాటి వెంకట రామారావు, S/o: కంభంపాటి శ్రీరాములు, వయస్సు:** 57సం||లు, **నివాసం:** మక్కినవారిగూడెం గ్రామం, టి.నరసాపురం మండలం, ఏలూరు జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయిం చుకున్నారు. కావున సదరు వ్యవహార మునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు (శెటిల్‌మెంటు ఆస్తి వివరం): ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ డి.లోని, టి.నరసాపురం మండలం, మక్కినవారిగూడెం పంచాయితీలోని మక్కినవారిగూడెం గ్రామం తాలూకు - నా స్వార్జితం బాపతు ఆస్తి అయివుండి, అనగా లోగడ ది. 28-7-1982వ తేదీన కాకర్ల వెంకట్రావు గారి వల్ల చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకం, 402 వాల్యూం, 477ల 479 పుటలలో 1982వ సం.పు ద.నెం. 1760రు గా నా పేర రిజిస్టరీ కాబడిన క్రయదస్తావేజు రీత్యా నాకు సర్వ హక్కులతో సంక్రమించబడి, నేటి వరకూ నా సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కు భుక్తములలో గల జిరాయితీ మేరకు నివేశన స్థలం రి.స.నె. 282 రు య.2-99ట్లులో నీకు శెటిల్‌మెంట్ చేసిన చ||గ|| 129లు, **డాక్యుమెంట్ : 471/2019** గల స్థలమునకు హద్దులు : **తూర్పు:** ఈ రోజున నేను కంభంపాటి సత్యనారాయణకు రిజిష్టరీ చేసిన స్థలం, **దక్షిణం :** కుంకపూడి వెంకట్రావు గారి స్థలం, **పడమర :** సాధు దుర్గారావు గారి స్థలం, **ఉత్తరం :** పంచాయితీ సిమెంటు రోడ్డు

ఇట్లు: గంధ్ర దీనదయాళ్, అడ్వకేట్ & నోటరీ,
సత్తుపల్లి, ఖమ్మం జిల్లా, సెల్ : 9848578963

CHANGE OF NAME

I, **GUDURI NAGESWARA RAO** S/o Guduri Anjaneyulu, residing at D.No. 3-164, Bokka Gudem, K.P.Palem, Mogaltur Mandal, W.G.Dt. A.P, I have changed my name from **GUDURU NAGESWARA RAO** (Old name) to **GUDURI NAGESWARA RAO** (New name) hence forth I am being called **GUDURI NAGESWARA RAO** S/o Guduri Anjaneyulu for all purposes.

CHANGE OF NAME

I, **GUDURI CHINNA** S/o Guduri Nageswara Rao, residing at D.No. 3-164, Bokka Gudem, K.P.Palem, Mogaltur Mandal, W.G.Dt. A.P, I have changed my name from **GUDURU CHINNA** (Old name) to **GUDURI CHINNA** (New name) hence forth I am being called **GUDURI CHINNA** S/o Guduri Nageswara Rao for all purposes.

CHANGE OF NAME

I, **GUDURI JAYA LAKSHMI** W/o Guduri Nageswara Rao, residing at D.No. 3-164, Bokka Gudem, K.P.Palem, Mogaltur Mandal, W.G.Dt. A.P, I have changed my name from **GUDURU JAYA LAKSHMI** (Old name) to **GUDURI JAYA LAKSHMI** (New name) hence forth I am being called **GUDURI JAYA LAKSHMI** W/o Guduri Nageswara Rao for all purposes.

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు నగరం, లక్ష్మీవారపుపేట. మౌలానా అజాద్ ఉర్దూపాటశాల వద్ద, వాస్తవ్యులు మొహమ్మద్ ఇల్యాన్ - ఉర్ - రెహమాన్ గారి కుమారుడు మొహమ్మద్ ముజీబ్ - ఉర్ - రెహమాన్ అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది.

నా క్లయింట్ తనయొక్క వర్జినల్ దస్తావేజు అనగా ది.11.06.1996వ తేదీన దేవీ రియల్ ఎస్టేట్ గవరవరం వారి వద్ద దుగ్గిరాల గ్రామములోని ఆర్.యస్.నెం:20/3లోని 240 చ.గ స్థలము కొనుగోలు చేసి ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.3438/1996 ది.13.06.1996గా రిజిస్టర్ కాబడిన వర్జినల్ డాక్యుమెంట్‌ను ది.10.06.2025వ తేదీన అతని బంధువు అయిన మహమ్మద్ షాకీర్‌కు ఇచ్చి జిరాక్సు కాపీలను తీయించుకురమ్మని చెప్పగా అతను దస్తావేజులను చేతి సంచిలో పెట్టుకుని తన యొక్క యాక్టివా స్కూటర్‌పై 12 పంపుల సెంటర్ కనకదుర్గమ్మ గుడి వద్ద గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళియున్నారనియున్నూ, షాపు వద్దకు వెళ్ళిచూడగా స్కూటర్‌కు తగిలించిన దస్తావేజులు గల చేతిసంచి కనబడలేదనియున్నూ, వెంటనే వచ్చిన దారిలో వెనకకు వెళ్ళి వెతగగా ఎక్కడా కనిపించలేదనియున్నూ తెలియపర్చినారు. సదరు దస్తావేజు కలిగిన సంచి ఎవరికైన దొరికిన యెడల నా ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసినదిగా కోరుచున్నాను.

ఆచంట వెంకటేశ్వరరావు
అడ్వకేట్, మాగంటి వారి వీధి,
ఆర్.ఆర్. పేట, ఏలూరు-2.
సెల్:94401 86699

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు నగరం, లక్ష్మీవారపుపేట. మౌలానా అజాద్ ఉర్దూపాటశాల వద్ద, వాస్తవ్యులు మొహమ్మద్ ఇల్యాన్ - ఉర్ - రెహమాన్ గారి కుమారుడు మొహమ్మద్ హసీబ్ - ఉర్ - రెహమాన్ అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది.

నా క్లయింట్ తనయొక్క వర్జినల్ దస్తావేజులు అనగా 1.ది.11.06.1996వ తేదీన దేవీ రియల్ ఎస్టేట్ గవరవరం వారి వద్ద దుగ్గిరాల గ్రామములోని ఆర్.యస్.నెం:20/3లోని 240 చ.గ స్థలము కొనుగోలు చేసి ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.3439/1996 ది.13.06.1996గా రిజిస్టర్ కాబడిన వర్జినల్ డాక్యుమెంట్ మరియు 2.ది.05.12.1996వ తేదీన శ్రీ శ్రీనివాస రియల్ ఎస్టేట్ & కన్‌స్ట్రక్షన్స్ ఏలూరు వారి వద్ద నుండి కొనుగోలు చేసి ఏలూరు రిజిస్టర్ వారి ఆఫీసులో నమోదు కాబడిన డాక్యుమెంట్ నెం.7198/1996, సోమవారప్పాడు గ్రామంలోని ఆర్.యస్.నెం.80/1లోని చ.గ.200లు స్థలము యొక్క వర్జినల్ దస్తావేజులను ది.10.06.2025వ తేదీన అతని బంధువు అయిన మహమ్మద్ షాకీర్‌కు ఇచ్చి జిరాక్సు కాపీలను తీయించుకు రమ్మని చెప్పగా అతను దస్తావేజులను చేతి సంచిలో పెట్టుకుని తన యొక్క యాక్టివా స్కూటర్‌పై 12 పంపుల సెంటర్ కనకదుర్గమ్మ గుడివద్దగల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళియున్నారనియున్నూ, షాపువద్దకు వెళ్ళిచూడగా స్కూటర్‌కు తగిలించిన దస్తావేజులు గల చేతిసంచి కనబడలేదనియున్నూ వెంటనే వచ్చిన దారిలో వెనుకకు వెళ్ళి వెతగగా ఎక్కడా కనిపించలేదనియున్నూ తెలియపర్చినారు. సదరు దస్తావేజు కలిగిన సంచి ఎవరికైన దొరికిన యెడల నా ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసినదిగా కోరుచున్నాను.

ఆచంట వెంకటేశ్వరరావు
అడ్వకేట్, మాగంటి వారి వీధి,
ఆర్.ఆర్. పేట, ఏలూరు-2.
సెల్:94401 86699